నీటి సంఘాలకు ఎన్నికల నగారా

- ఈనెల 8న నిర్వహణ
- ఎనిమిదేళ్ల తర్వాత పాలకవర్గాలు
- నియోజకవర్గంలో 10 మేజర్, ఆరు మైనర్ సంఘాలు


నిడదవోలు వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ


పెండ్యాల ఎత్తిపోతల పథకం

నిడదవోలు: సాగునీటి సంఘాల ఎన్నికల నగారా మోగింది. ఈ నెల 8న ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సాగునీటి సంఘాలకు చివరిసారిగా 2017 ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించారు. పశ్చిమ డెల్టా పరిధిలో 102 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయి. వాటిలో నిడదవోలు నియోజకవర్గంలోని 10 మేజర్ సాగునీటి సంఘాలు, ఆరు మైనర్ సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు 12 మంది సభ్యులను ఎన్నుకుంటారు. దీంతో రూ.5 లక్షల లోపు గ్రాంట్‌తో అభివృద్ధి పనులను సాగునీటి సంఘాలు స్వయంగా నిర్వహించుకోనున్నాయి. ఆయకట్టు పరిధిలోని రైతులు మాత్రమే సాగునీటి సంఘాల ప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంటుందని జలవనరుల శాఖ శెట్టిపేట ఏఈ ఎంవీవీ పెద్దిరాజు తెలిపారు. ఎన్నికలకు ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల కానుంది. ముందుగా నీటి వినియోగదారుల సంఘం (డబ్ల్యూయూఏ), ఆ తర్వాత డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ), ఆపై ప్రాజెక్టు కమిటీ (పీసీ)ల ఎన్నికలను వారం రోజుల పాటు నిర్వహించనున్నారు.

సంఘాల ఎన్నికతో అభివృద్ధి

సాగునీటి సంఘాల ఎన్నిక పూర్తయితే నిడదవోలు నియోజకవర్గంలో ఆయకట్టు అభివృద్ధి జరుగుతుందని రైతులు భావిస్తున్నారు. ఈ ఎన్నికలు తహసీల్దార్ల పర్యవేక్షణలో నిర్వహిస్తారు. ప్రతి సెక్షన్ నుంచి ఎంపికైన గ్రామాల్లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నిక ఏకగ్రీవం కాని పక్షంలో ఓటింగ్ విధానం అమలు చేస్తారు. సాగునీటి సంఘాల ఎన్నికతో చెరువులు, కాలువల మరమ్మతులు, సాగునీటి ద్యాముల ద్వారా రైతులకు నీటిని అందించే ప్రణాళికలు రూపొందిస్తారు. సంఘాల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది.

ఏయే సంఘాలకు..

నియోజవర్గంలోని నిడదవోలు మండలంలో మూడు మేజర్, ఆరు మైనర్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మండలంలోని పెండ్యాల, నిడదవోలు, శెట్టిపేట ఆయకట్టు పరిధిలో మేజర్ సాగునీటి సంఘాలకు సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పెరవలి మండలంలోని కానూరు, పెరవలి, ఖండవల్లి మేజర్ సాగునీటి సంఘాలకు, ఉండ్రాజవరం మండలంలోని ఉండ్రాజవరం, వేలివెన్ను, సత్యవాడ, పసలపూడి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఆయా గ్రామాల జెడ్పీ హైస్కూళ్లలో ఎన్నికలు జరుపుతారు.

నామినేషన్ పద్ధతిపై పనులు

రూ.ఐదు లక్షల లోపు అత్యవసర పనులన్నీ నామినేషన్ పద్ధతిపై సాగునీటి సంఘాల ప్రతినిధులు చేపడతారు. సాగునీటి పంపిణీలో ఎదురయ్యే తూడు, గుర్రపు డెక్క తొలగింపు, కాలువ గట్ల సంరక్షణ, షట్టర్లు, స్లూయిజ్‌ల మరమ్మతుల వంటి అత్యవసర పనులు చేయిస్తారు. వీటికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. జలవనరుల శాఖ అధికారులు వీటిని పర్యవేక్షిస్తారు. ప్రధాన కాలువలు పీసీ, మీడియం కాలువలు డీసీ, మైనర్ కాలువలు డబ్ల్యూయూఏల పరిధిలోకి వస్తాయి.

అక్రమాలకు అడ్డుకట్ట



చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలించే అక్రమార్కుల నియంత్రణకు సాగునీటి సంఘాలు దోహదపడతాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సాగునీటి అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఈ సంఘాలు పర్యవేక్షిస్తారు.

–కారింకి అబ్బులు, రైతు, సింగవరం

పదవీకాలం ఐదేళ్లు



సాగునీటి సంఘాల ఎన్నికలను డిసెంబర్ 8న తహసీల్దార్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. తహసీల్దారు కార్యాలయంలో ఫాం–3 ఏ పత్రాలు లభిస్తాయి. ఎన్నికైన సంఘాల పదవీకాలం ఐదేళ్లు. సాగునీటి సంఘాల ద్వారా అత్యవసర పనులు చేపట్టడానికి రూ.5 లక్షల లోపు నామినేషన్ పద్ధతిలో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తాం.

–ఎంవీవీ పెద్దిరాజు, జలవనరుల శాఖ ఏఈ, శెట్టిపేట కెనాల్ సెక్షన్

రెండు గ్రామాల్లో దివ్యాంగులకు బస్‌పాస్‌లు


కవులూరులో దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

నల్లజర్ల: మండలంలోని నబీపేట, కవులూరు గ్రామాల్లోని దివ్యాంగుల కోసం మంగళవారం తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో వారు బస్‌పాస్‌ల శిబిరాలు నిర్వహించారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కవులూరులో 30 మంది దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు. అమర్ అనే దాత ఆర్థిక సాయంతో సర్పంచ్ మద్దిపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. అలాగే నబీపేటలో 15 మంది దివ్యాంగులకు గ్రామపెద్ద గోతం కృష్ణాయాదవ్ బస్‌పాస్‌లు అందజేశారు. కార్యక్రమాల్లో తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో సూపర్‌వైజర్ డీవీ కుమార్, ఏఎస్‌వీ రమేష్‌నాయుడు, కేసీహెచ్ పుల్లయ్య, యిజ్జిరోతు వెంకట సత్యనారాయణ, పి.ప్రేమానందరావు పాల్గొన్నారు. బస్‌పాస్‌ల దాత అమర్‌ను డిపో సూపర్‌వైజర్ డీవీ కుమార్, సర్పంచ్ శ్రీనివాసరావు శాలువాతో సత్కరించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ధర్నా


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, పీఓడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలంటూ, స్మార్ట్ మీటర్లు బిగించడం మానుకోవాలంటూ నినాదాలు చేశారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతం అవుతున్న పేదలపై విద్యుత్ చార్జీల భారం మోపడం దుర్మార్గం అన్నారు. అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మాదిరిగానే మన రాష్ట్రంలో కూడా పేదలకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో జవహర్ బాజీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు పాతకోకల నాగేశ్వరరావు, పీఓడబ్ల్యూ నాయకురాలు ఈమని మల్లిక, సాయి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్ సినిమా చూపిస్తున్న చంద్రబాబు

దేవరపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు సింగపూర్ సినిమా చూపిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. దుద్దుకూరులో ఏర్పాటు చేసిన ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ కార్యాలయాన్ని మంగళవారం విశ్వేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు వెలగా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో విశ్వేశ్వరరెడ్డి మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు 2.70 లక్షల మంది వలంటీర్ల ఉద్యోగాలు పీకేశారన్నారు. కాకినాడ పోర్టులో అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేస్తున్న రూ.48 వేల కోట్ల విలువ బియ్యం సీజ్ చేసినట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారని, ఆ బియ్యం ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. పీసీసీ ఉపాధ్యక్షుడు, నియోకజవర్గ సమన్వయకర్త మార్టిన్ లూథర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం. శారద, నియోజకవర్గాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

సైబర్ మోసాల బారిన పడకండి


సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాయక్, ఎస్సై సతీష్‌కుమార్

గోపాలపురం: సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరపల్లి సీఐ బి.నాగేశ్వర్ నాయక్ సూచించారు. సైబర్ నేరాలపై మంగళవారం గోపాలపురంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాయక్ మాట్లాడుతూ అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా దూర ప్రాంతాకు వెళ్లాల్సి వచ్చినపుడు తప్పనిసరిగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తద్వారా నేరాలు అదుపునకు వీలుంటుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ అన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

లక్ష్మీపురంలో..

దేవరపల్లి: శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు దేవరపల్లి సీఐ బి. నాగేశ్వర్ నాయక్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం రాత్రి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో సారా తయారీ, విక్రయాలు, మద్యం బెల్ట్ దుకాణాల నిర్వహణ జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై పీడీ యాక్ట్ కింద కేసు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. గ్రామ సమస్యలపై గ్రామ పెద్దలతో చర్చించారు. ఈ సదస్సులో దేవరపల్లి ఎస్సై వి. సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు

పెరవలి: వాతావరణం తెరిపిచ్చి మంగళవారం ఎండ కాయడంతో తడిసిన ధాన్యాన్ని రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్నారు. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కళ్లాల్లోను, రోడ్లపైన ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయిన విషయం తెలిసిందే. మంగళవారం మండలంలోని రోడ్లు, పుంతగట్లు ఎక్కడ చూసినా ఆరబెట్టిన ధాన్యమే కనిపించాయి. ఉదయం మబ్బులు వేసినప్పటికీ చినుకులు పడలేదు. ఎక్కడ వర్షం వస్తుందో, ధాన్యం రాశులు ఏమైపోతాయోనని రైతులు ఆందోళన చెందారు. ఉదయం 10 గంటల తరువాత ఎండ రావడంతో రైతులు ధాన్యాన్ని రోడ్లపై బరకాలు వేసి ఆరబెట్టారు. మండలంలోని కానూరు, కాకరపర్రు, పెరవలి, కాపవరం, ముక్కామల, ఖండవల్లి, పిట్టల వేమవరం గ్రామాల్లో ధాన్యం రాశులు రోడ్లుపై ఆరబెట్టిన దృశ్యాలు దర్శనం ఇచ్చాయి.

88 శాతం ఇంటి పన్నుల ఆన్‌లైన్ పూర్తి

ఉండ్రాజవరం: ఇంటి పన్నుల డేటా ఆన్‌లైన్ ప్రక్రియ మండలంలో 88 శాతం పూర్తయ్యిందని ఈవోపీఆర్డీ అంజనేయశర్మ మంగళవారం తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 18,278 గృహాలు ఉండగా, 16,082 గృహాలకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. దమ్మెన్ను, చిలకపాడు, కె.సావరం, పసలపూడి గ్రామాల్లో నూరు శాతం ఆన్‌లైన్ పూర్తయ్యిందన్నారు. ఇంటి యజమాని నేరుగా ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను చెల్లించుకొనేందుకు వీలుగా ఇంటి పన్నుల విధానాన్ని ఆన్‌లైన్ చేస్తున్నట్లు వివరించారు.

వైకల్యం శరీరానికే .. మనసుకు కాదు

- ఘనంగా దివ్యాంగుల దినోత్సవం
- చిన్నారులకు ఆటల పోటీల నిర్వహణ
- విజేతలకు బహుమతుల ప్రదానం


దుద్దుకూరు భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు బహుమతుల పంపిణీ

నల్లజర్ల: వైకల్యం శరీరానికే గాని మనసుకు కాదని, ప్రస్తుత కంప్యూటర్ యుగంలో దివ్యాంగులు సకలాంగులకు ఏమాత్రం తీసిపోరని ఎంఈఓ వై.సత్యనారాయణ అన్నారు. నల్లజర్ల నంబర్–2 పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఈఓ–2 భగవతి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఐఈఆర్టీ ఉపాధ్యాయులు రష్మిత, రేణుక, నంబరు–2 పాఠశాల హెచ్‌ఎం సుమాలిని, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక భవిత కేంద్రం వద్ద దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాధారణ బాలబాలికల కంటే దివ్యాంగ బాలబాలికల్లో అనూహ్యమైన ప్రతిభాపాటవాలు ఉంటాయన్నారు. వినయ్ అనే దివ్యాంగునికి జన్మదిన వేడుకలు నిర్వహించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు తిగిరిపల్లి రాజేష్, హెచ్‌ఎం టీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు హితవచిని, హిదయతుల్లా, సీఆర్పీ నాగరాజు, దివ్యాంగులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: వైకల్యం ఉందని కుంగిపోకుండా దివ్యాంగులంతా మనోధైర్యంతో ముందుకు సాగాలని ఎంఈఓ కేవీ గణేశ్ అన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని సమిశ్రగూడెం భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మానసిక దివ్యాంగులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 పి.గురుమూర్తి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ జగన్నాథరావు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మణరావు, హెచ్‌ఎం కె.జిలానీ, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దుద్దుకూరు భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్వ్ ఫౌండేషన్ ద్వారా ఎంఈఓలు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మండలంలోని 50 మంది దివ్యాంగ విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకావసరాల ఉపాధ్యాయుడు పి.పెద్దిరాజు, కె.శ్రీదేవి, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం స్వర్ణకుమారి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కొయ్య సువర్ధన, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక వెలుగు కార్యాలయంలోను, కానూరు భవిత కేంద్రంలోను దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. పెరవలి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ వెంకటరమణ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రంగనాథ్‌లను దివ్యాంగులు ఘనంగా సత్కరించారు. కానూరు కార్యక్రమానికి ఎంఈఓలు బి. స్వరూప్, సూర్జహాన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబటి బ్రహ్మయ్య, వెన్నపు సుధాకర్ ఆర్థిక సహకారంతో దివ్యాంగులకు దుప్పట్లు బహూకరించారు. కార్యక్రమాల్లో వెలుగు ఏపీఎం బి. రామకృష్ణ, ఐఈఆర్‌టి యం శిరీష, కె సత్యవరలక్ష్మి, దివ్యాంగులు వికలాంగుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

గోపాలపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ కె. అజయ్‌బాబు అన్నారు. ఈనెల 5న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల పూర్తయ్యే వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మొత్తం 54 మంది ఓటర్లకు గానూ 40 మంది మహిళలు 14 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించుకుంటారని చెప్పారు.

పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్

తాళ్లపూడి: ఈ నెల 5న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించే తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద బుధ, గురువారాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. మండలంలో 61 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. మద్యం షాపులు తెరవరాదని తెలిపారు.

ముద్రగడ గిరికి పార్టీ ఇన్‌చార్జిపై హర్షం

తాళ్లపూడి: కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం తనయుడు గిరిబాబును వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంపై ఆ పార్టీ మండల కాపు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో కాపులకు జగన్ మోహన్‌రెడ్డి సముచిత స్థానం గుర్తింపు కల్పిస్తున్నారని వారు పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, మండల కాపుసంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, జిల్లా కాపు సంఘం నాయకులు వనిమిరెడ్డి శ్రీనివాస్, కొమ్మిరెడ్డి పరశురామారావు, వల్లభశెట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలి

నల్లజర్ల: విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్, ధర్మప్రచారక్‌లు పిలుపునిచ్చారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం సమరసత సేవాఫౌండేషన్ జిల్లా కార్యదర్శి ఉప్పలపాటి మాధవరావు, ఆర్‌ఎస్‌ఎస్ కొవ్వూరు జిల్లా ప్రముఖ్ పార్థసారథి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. హిందూ బంధువులందరూ ఈ కార్యక్రమానికి తరలిరావాలని సమావేశంలో వారు పిలుపునిచ్చారు. సమావేశంలో కందుల రవిశేఖర్, జిల్లా రమేష్, మాయలేడి తాతారావు, సవలం రామకృష్ణ, బదిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా వేళల మార్పు

నిడదవోలు: కార్తిక మాసం మంగళవారంతో ముగియడంతో పట్టణంలో మంచినీటి సరఫరా వేళలను మార్చినట్టు మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి తెలిపారు. పట్టణంలో సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు సరఫరా చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. పట్టణ ప్రజలు గమనించాలని కోరారు.

యువకుడి ఆచూకీ కోసం గాలింపు


పోలవరం కుడి కాలువ సైఫన్ వద్ద గాలిస్తున్న గజ ఈతగాళ్లు

నల్లజర్ల: అనంతపల్లిలో పోలవరం కుడి కాలువ సైఫన్ వద్ద సోమవారం రాత్రి నబీపేటకు చెందిన మర్రి నవీన్‌కుమార్ అనే యువకుడు ప్రమాదవశాత్తూ కాలువలో జారి పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో మంగళవారం ఉదయం పోలీస్, ఫైర్ సిబ్బంది కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. నవీన్‌కు చెందిన బైక్, సెల్‌ఫోన్, చెప్పులు సైఫన్ వంతెన వద్ద ఉండడం ఈ అనుమానాలకు తావిచ్చింది. మంగళవారం సాయంత్రం ఏలూరు నుంచి గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆ యువకుడి ఆచూకీ లభించలేదని నల్లజర్ల ఏఎస్‌ఐ మోహనరావు చెప్పారు. బుధవారం మరోమారు గాలింపు చర్యలు చేపడతామన్నారు.

ఉచిత ఇసుక రవాణాలో రూల్స్ పాటించాలి

తాళ్లపూడి: భవన నిర్మాణదారులు ర్యాంపుల నుంచి ఉచిత ఇసుక తీసుకువెళ్లేటపుడు విధిగా కొత్త నిబంధనలు అమలు చేయాలని తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ సూచించారు. బల్లిపాడు ర్యాంపు వద్ద నుంచి ఉచిత ఇసుక తీసుకు వెళ్లవచ్చని మంగళవారం ఆయన ప్రకటించారు. ఈ ర్యాంపు వద్ద ఇటీవల టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలకు తహసీల్దార్ మంగళవారం వివరణ ఇచ్చారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచిత ఇసుక తీసుకుని వెళ్లవచ్చన్నారు. ఉచిత ఇసుక కావాల్సిన వారు పంచాయతీ కార్యదర్శి నుంచి అనుమతి పత్రం తీసుకొని, మీ సేవలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ అనుమతి పత్రంతో పాటు జీపీఎస్ కలిగిన ట్రాక్టర్ ద్వారా ఇసుక తీసుకు వెళ్లవచ్చన్నారు. ఇసుక ర్యాంపుల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సిబ్బంది ర్యాంపుల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు హనీఫహా మెహనాజ్



చాగల్లు: జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు చాగల్లు పంచాయతీ కార్యదర్శి ఎండీ అలీ కుమార్తె హనీఫహా మెహనాజ్ ఎంపికైంది. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పదో తరగతి విద్యార్థిని హనీఫహా మెహనాజ్ నాలుగు బంగారు పతకాలు సాధించింది. ఈ క్రమంలో మైసూరులో ఈనెల 5 నుంచి 15 వరకు నిర్వహించే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఆమె అర్హత సాధించింది. అంతేగాకుండా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించిన హనీఫహా మెహనాజ్ అండర్–17 విభాగంలో రాష్ట్ర జట్టు తరపున ఈనెల 25 నుంచి 30 వరకు జరిగే జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవలు

కొవ్వూరు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గామన్ బ్రిడ్జి జంక్షన్ వద్ద రాత్రిపూట ప్రయాణికులు నిరీక్షించేందుకు వీలుగా క్లబ్ ఐదు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసింది. కొవ్వూరు ప్రెస్ రిపోర్టర్స్ అసోసియేషన్ భవనానికి నాళం వీర వెంకట శ్రీనివాసరావు తలుపులు అందించారు. అనాథాశ్రమానికి స్టీలు ప్లేట్స్, గ్లాసులను ఉప్పల శివప్రసాద్, నిత్యావసర సరుకుల నిమిత్తం మట్టే వీర వెంకట వర ప్రసాద్‌లు రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక అచ్చాయమ్మ కాలనీలో గ్రంధి గంగాధర ప్రవీణ్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ వలివేటి ప్రసాద్ ప్రారంభించారు. క్లబ్ గెలాక్సీ చైర్మన్ మద్దుల వీర వెంకట సత్యనారాయణ, ప్రాజెక్టు చైర్మన్ కొల్లేపర వెంకటేశ్వరరావు (శ్రీను), పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు(నాని) క్లబ్ అధ్యక్షుడు దేవతు కృష్ణ ప్రసాద్, కార్యదర్శి రాఘవ రమాకాంత్, కోశాధికారి సత్యవరపు గురునాథ్‌లతో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆచూకీ గల్లంతు

గోష్పాదక్షేత్రంలో కారు వదిలేసిన వైనం

కొవ్వూరు: దేవరపల్లి మండలం సంగాయగూడేనికి చెందిన యలమాటి శ్రీనివాసరావు అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఏడు గంటలకు కారులో గోష్పాద క్షేత్రానికి వచ్చి గల్లంతయ్యారు. ఆయన తన సెల్ ఫోన్, పర్సు కారులో ఉంచి వెళ్లి తిరిగి రాలేదని చెబుతున్నారు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. గోష్పాదక్షేత్రం వద్ద కారును గుర్తించారు. గోదావరి నదిలో మునిగి గల్లంతై ఉండవచ్చునని భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియరాలేదు. దీనిపై శ్రీనివాసరావు భార్య పద్మకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి తన భర్త కారులో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్టు పద్మకుమారి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.